క్లుప్తంగా

ఎలక్షన్ డీటీగా సత్యనారాయణ మూర్తి


సత్యనారాయణ మూర్తి

నెల్లిమర్ల: మండల ఎలక్షన్ డీటీగా ఎన్. సత్యనారాయణమూర్తి నియామకమయ్యారు. ఎల్.కోట మండలంలో సీఎస్‌డీటీగా పనిచేసిన సత్యనారాయణమూర్తి ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎలక్షన్ డీటీగా పనిచేసిన రేగాన ఈశ్వరమ్మ ఎల్. కోట సీఎస్‌డీటీగా వెళ్లారు. ఈ సందర్భంగా డీటీ సత్యనారాయణ మీడియాతో మాట్లాడుతూ, 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.

మహాసభను విజయవంతం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

విజయనగరం ఫోర్ట్: ఈ నెల 11న హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరగనున్న మాదిగ ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు భోగి శ్రీనుమాదిగ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్గీకరణ వల్ల మాత్రమే మాదిగ, రెల్లి ఉప కులాలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామజికంగా అభివృద్ధి చెందుతారని అభిప్రాయపడ్డారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరగనున్న మహాసభకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో రాము మాదిగ, చంటి మాదిగ, కృష్ణ మాదిగ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదు...


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు

పూసపాటిరేగ: ప్రధానమంత్రి మోదీ ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర నాయకుడు వై. వెంకటేశ్వరరావు అన్నారు. సీపీఎం ప్రజారక్షణ భేరి కార్యక్రమంలో భాగంగా చేపట్టిన బస్సుయాత్ర శుక్రవారం పూసపాటిరేగ చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించిందన్నారు. దేశాన్ని ఇబ్బంది పాల్జేస్తున్న బీజేపీని గద్దె దించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయికులు తమ్మినేని సూర్యనారాయణ, టీవీ రమణ, బి.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏటీ అగ్రహారంలో అదుపులో డయేరియా


ఎంపీడీఓ రామారావు

నెల్లిమర్ల: మండలంలోని ఏటీ అగ్రహారంలో ప్రబలిన డయేరియా అదుపులోకి వచ్చిందని ఎంపీడీఓ జి. రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, గ్రామానికి చెందిన 15 మంది డయేరియా బారిన పడగా.. ప్రస్తుతం వారంతా కోలుకున్నట్లు చెప్పారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో శిబిరాలు నిర్వహించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించారన్నారు.

పురాణాలు మార్గనిర్దేశకాలు..


ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న స్వప్నహైందవి

విజయనగరం టౌన్: పురాణాలు మానవశ్రేయస్సుకు, సమాజానికి మార్గనిర్దేశకాలని ఆధ్యాత్మిక శిరోమణి, రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి అన్నారు. శుక్రవారం స్థానిక టీటీడీ కల్యాణ మంటపం ఆవరణలో 'పురాణాలు – సమాజ శ్రేయస్సు' అనే అంశంపై ప్రవచనం చేశారు. అష్టాదశ పురాణాలపై కొద్దిపాటి అవగాహన ఉన్నా జీవితం ఎంతో సుగమమవుతుందన్నారు. పురాణాల్లో అనేకమైన మానవీయ విలువలు ఉన్న కథలు ఉన్నాయన్నారు. వేదవ్యాసుడు రచించిన అష్టాదశ పురాణాలు ఎంతో విశిష్టమైనవని చెప్పారు. పద్మ, మత్స్య, మార్కండేయ, వాయు, విష్ణు, వరాహ, వామన, అగ్ని, నారద, తదితర పురాణాల్లో ఉన్నటువంటి ప్రధాన ఘట్టాలను వివరించారు. కార్యక్రమం అనంతరం నిర్వాహకులు ఆమెను ఘనంగా సత్కరించారు.

ప్రజావసరాలు తీర్చడమే ధ్యేయం

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


అయ్యన్నపేట ప్రాంతంలో నూతన రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: నగర ప్రజల అవసరాలు తీర్చడమే ధ్యేయంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో చేపట్టిన అభివృద్ధి పనులకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి శుక్రవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మొత్తం 63.25 లక్షల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. వీటీ అగ్రహారంలో రహదారులు.. కంటోన్మెంట్ అంబేడ్కర్ కాలనీలో సామాజిక భవనాన్ని ప్రారంభించడంతో పాటు సంజీవయ్య కాలనీలో రహదారి పనులకు శ్రీకారం చుట్టారు. అనంతరం అయ్యన్నపేట, ఆర్‌టీసీ కాలనీ ప్రాంతాలలో రహదారి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ, నగరంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో ప్రస్తుతం జరుగుతోందన్నారు. ఏ ప్రాంతం చూసినా సంపూర్ణ మౌలిక సదుపాయాలతో కనిపిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తుంటే స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి జిల్లా కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రధాన జంక్షన్లను అభివృద్ధి చేయడమే కాకుండా రహదారుల విస్తరణ, ప్రత్యేక ఆకర్షణతో ప్రధాన కూడళ్ల ఆధునీకరణ వంటివి ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటున్నాయన్నారు. మరలా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందన్నారు. 38వ డివిజన్ కార్పొరేటర్ తొగురోతు సంధ్యారాణి మాట్లాడుతూ, శివారు ప్రాంతమైన తమ డివిజన్ ఎంతగానో అభివృద్ధి చెందడానికి కారణం వీరభద్రస్వామేనని చెప్పారు. ఆర్టీసీ కాలనీ ఏర్పడి 30 సంవత్సరాలు పూర్తికావొస్తున్న కనీస మౌలిక సదుపాయాలు లేక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుతం కాలనీలో రహదారులు, కాలువలు ఏర్పాటు చేయడమే కాకుండా తాగునీటి సౌకర్యం కల్పించడంతో ప్రజలందరూ ఎంతో ఆనందంగా ఉన్నారని తెలిపారు. ఇప్పటివరకు రెండు కోట్ల రూపాయలకు పైబడి అభివృద్ధి పనులు తమ డివిజన్‌లో జరగడం తమ అదృష్టమన్నారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఆయా డివిజన్ల కార్పొరేటర్లు సుంకరి నారాయణస్వామి, బోనెల ధనలక్ష్మి, చందక శ్రీనివాసరావు, సైలాడ ఈశ్వరమ్మ, ఆయా డివిజన్ల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగన్నాథుడికి నూతన రథం


రథాన్ని తయారుచేసే వ్యక్తికి చెక్ అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం టౌన్: దేవదాయశాఖ, నా ఊరు విజయనగరం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో దాసన్నపేటలోని జగన్నాథస్వామికి నూతన రథం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మజ్జి శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం నా ఊరు విజయనగరం స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు విశాల మాట్లాడుతూ, జగన్నాథస్వామికి కొత్త రథం నిర్మిస్తున్నామని, వచ్చే ఏడాది రథయాత్ర కొత్త రథంలో వైభవంగా నిర్వహిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. సంస్థ ద్వారా సేకరించిన 5 లక్షల రూపాయల్లో రెండు లక్షల రూపాయలను రథం తయారుచేసేవారికి ముఖ్య అతిథుల చేతులమీదుగా అందజేశారు. ఈఓ సుధారాణి మాట్లాడుతూ, ప్రభుత్వం తరపున తగు సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపుగంటి ప్రకాష్, సభ్యులు రవి, త్రినాథ్, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్‌డీగా సింహాద్రి

నెల్లిమర్ల: మండల పరిషత్ కార్యాలయ ఈఓపీఆర్‌డీగా కె. సింహాద్రి నియామకమయ్యారు. ఈయన శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలంలో గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ మేరకు ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

'జనసురక్ష'ను సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు

పూసపాటిరేగ: స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జనసురక్ష పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కందివలసలో స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గ్రామస్థాయి జనసురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్టేట్‌బ్యాంక్‌లో డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నామన్నారు. తక్కువ పెట్టుబడితో ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ బ్యాంక్ సేవలను వినియోగించుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ ప్రతినిధులు మురళి, గంటా పైడిరాజు, ఎస్‌వీ గణపతిరావు, సర్పంచ్ దేశెట్టి గణేష్, ఎంపీటీసీ సభ్యుడు చాపల సత్తిబాబుతో పాటు పలువురు ఖాతాదారులు పాల్గొన్నారు.

నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి

● వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వీసీ ప్రశాంత్ కుమార్ మహంతి

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని వీసీ ప్రశాంత్ కుమార్ మహంతి సూచించారు. మండలంలోని టెక్కలి సెంచూరియన్ వర్సిటీలో బీబీఏ చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తరగతి గదిలో నేర్చుకున్న విద్య మాత్రమే సరిపోదని.. ఎప్పటికప్పుడు వ్యాపార అనుకూల వాతావరణం తెలుసుకోవడంతో పాటు వాటిపై విశ్లేషణ చేయాలన్నారు. తమలో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీయాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా మేనేజ్‌మెంట్ విద్యకు డిమాండ్ ఎక్కువగా ఉందని, అందివచ్చిన అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ డీన్ ప్రొఫెసర్ పీఎస్‌వీ రమణారావు, బీబీఏ విభాగాధిపతి శ్రీనివాస్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు మోహన్‌బాబు, సోమశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

డేటా సైన్స్‌తో విప్లవాత్మక మార్పులు


సైంటిస్ట్ విశ్వనాథ్‌ను సత్కరిస్తున్న వైస్ ప్రిన్సిపాల్, అధ్యాపకులు

డెంకాడ: ఆధునికతరంలో డేటా సైన్స్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తోందని స్విగ్గీ కంపెనీ సీనియర్ సైంటిస్ట్ గంగవరం విశ్వనాథ్ అన్నారు. జొన్నాడ వద్ద ఉన్న లెండి ఇంజినీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో డేటా సైన్స్‌పై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధునిక ప్రపంచంలో విస్తారమైన లావాదేవీలు, డేటా విస్తరణ ఎన్నో పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడతాయన్నారు. కృత్రిమ మేధస్సు వంటి డేటా శక్తిని ఉపయోగించగల నిపుణులకు మరింత డిమాండ్ ఉంటుందని చెప్పారు. అనంతరం విశ్వనాథ్‌కు నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఓడీ ఎ.రామారావు, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, ప్లేస్‌మెంట్స్ డీన్ జి.ప్రకాష్‌బాబు, అధ్యాపకులు యుగంధర్, నాగేశ్వరరావు, సత్యనారాయణ, కార్తీక్, రామచంద్రరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ అజెండా


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

● ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

భోగాపురం: అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని దల్లిపేట పంచాయతీలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రజలను అప్యాయంగా పలకరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిపై ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ మాట్లాడుతూ.. అవినీతి, లంచాలకు ఆస్కారం లేకుండా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తాము ఏ గడపకు వెళ్లినా ప్రజలు చిరునవ్వులతో ఆహ్వానిస్తున్నారన్నారు. ఇవే ఆదరాభిమానాలు చూపుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ దల్లి కాంత, పడాల భానుప్రకాష్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బైరెడ్డి ప్రభాకరరెడ్డి, పడాల శ్రీనివాసరావు, సుందర హరీష్, మత్స్యశాఖ డైరెక్టర్ నరసింహులు, దల్లి శ్రీనివాసరావు, అప్పుభుక్త పైడినాయుడు, కిలారి వెంకటరమణ, కొల్లు రామ్మూర్తి, కొయ్య లక్ష్మణ్, శీరపు గురునాథ్‌రెడ్డి, తహసీల్దార్ చింత బంగార్రాజు, ఎంపీడీఓ అప్పలనాయుడు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యం

● కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు


విజయనగరం: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు


విజయనగరం: 11వ వార్డులో వైద్య శిబిరంలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది

విజయనగరం: ప్రజల ఆరోగ్య భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. పీడబ్ల్యూ భవనంలో, రాజీవ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష శిబిరాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రజలకు అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్ శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆరోగ్య శిబిరాలకు వచ్చి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 25, 26 సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వలంటీర్లు, కార్యదర్శులు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్నారా, లేదా అని పరిశీలించారు.యూజర్, కుళాయి చార్జీలను వసూలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

11 వార్డులో...

నగరంలోని 11వ వార్డులో జగనున్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులను పరీక్షించి వైద్యసేవలందించారు. కార్యక్రమంలో ఘోషా ఆస్పత్రి వైద్య సిబ్బంది, వార్డు పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరి పంటకు మానిపండు తెగులు


సస్యరక్షణపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ నిర్మల, తదితరులు

డెంకాడ: వరి పంటకు ప్రస్తుతం మానిపండు తెగులు ఆశించిందని, దీని నివారణకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి పి.నిర్మల తెలిపారు. మండలంలోని సింగవరంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మానిపండు తెగులు నివారణకు ప్రొపికొనజోల్ మిల్లీలీటర్ మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మధ్యాహ్నం రెండు గంటల తర్వాత పిచికారీ చేయాలని సూచించారు. మరికొన్ని చోట్ల ఆకుముడత తెగులు ఆశించిందని.. దీని నివారణకు కార్బోహైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 2 గ్రాముల మందును లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ బి.రామకోటి, గ్రామపెద్దలు పిట్టా అప్పారావు, బమ్మిడి అప్పలస్వామినాయుడు, ప్రకృతి వ్యవసాయం సీఏ సుజాత, రైతులు పాల్గొన్నారు.

విద్యా సామర్థ్యాల మదింపు పరీక్ష ప్రశాంతం


పూసపాటిరేగ: జెడ్పీ ఉన్నత పాఠశాలలో పరీక్ష తీరును పరిశీలిస్తున్న ఎంఈఓలు


నెల్లిమర్ల: పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

పూసపాటిరేగ: జాతీయస్థాయిలో విద్యా సామర్థ్యాల మదింపు పరీక్ష మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పరీక్షలను మండల విద్యాశాఖాధికారులు బి. పాపినాయుడు, ఎ. రాజ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జాతీయస్థాయిలో జరుగుతున్న పరీక్షల ద్వారా విద్యార్థుల్లోని భాషా సామర్థ్యంతో పాటు గణితశాస్త్రంలోని సామర్థ్యాలను అంచనా వేయడం జరుగుతోందన్నారు. ఈ మదింపు ఆధారంగా విద్యావ్యవస్థలో వస్తున్న నూతన పోకడలతో పాటు పాఠ్యప్రణాళికల్లో మార్పులు, బోధనా పద్ధతులు, ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాలలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో పూసపాటిరేగ జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం బి. శంకరరావు, తదితరులు ఉన్నారు.

1,360 మంది విద్యార్థులు హాజరు

నెల్లిమర్ల: జాతీయ స్థాయిలో 3,6,9 తరగతుల్లో సామర్థ్య పరిశీలన పరీక్ష నిర్వహించారు. మండలంలోని 29 పాఠశాలల్లో 1360 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఎంఈఓ యు. సత్యనారాయణ మూర్తి తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాల అనుగుణంగా భవిష్యత్‌లో విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చేందుకు ఈ పరీక్ష దోహదపడుతుందన్నారు.

విద్యాభివృద్ధితో సమాజాభివృద్ధి


మోపాడ ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం రాష్ట్ర జోన్ -2 ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్

డెంకాడ: విద్యాభివృద్ధితో సమాజం అభివృద్ధి చెందుతుందని గ్రహించిన దాతలు ప్రభుత్వ పాఠశాలలకు బెంచీలు వితరణ చేయడం హర్షణీయమని వైఎస్సార్‌సీపీ ఐటీ విభాగం రాష్ట్ర జోన్ -2 ఇన్‌చార్జ్ బడ్డుకొండ మణిదీప్ అన్నారు. ముంబైకు చెందిన ఈసీజీసీ ఆర్థిక సహకారంతో సీఎఫ్‌టీఐ, వాంటేర్ రౌండ్‌టేబుల్-92 సంస్థ డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలలకు రెండు వందల బెంచీలను వితరణగా అందించారు. మండలంలోని మోపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో బడ్డుకొండ మణిదీప్ మాట్లాడుతూ, ఇలాంటి సంస్థల ప్రోత్సాహంతో విద్యార్థులు మరింత ఉత్సాహంతో చదువుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాట్లాడుతూ, సమాజసేవకు దాతల సహకారం గొప్పదన్నారు. కార్యక్రమంలో మోపాడ మాజీ సర్పంచ్ బడ్డుకొండ రమేష్, ఎంఈఓ రాధాకృష్ణ, ఈసీజీసీ ప్రతినిధులు చింతరంజన్ దత్త, వెంకట ప్రదీప్, సీఎఫ్‌టీఐ ప్రతినిధి సిద్దేష్ భాగ్వే, వాంటేర్ రౌంటేబుల్ ప్రతినిధులు కోనూరు అభిషేక్, అఖిల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● ఆకట్టుకుంటున్న ప్రమిదలు

జిల్లా కేంద్రంలో దీపావళి సందడి కనిపిస్తోంది. ముఖ్య కూడళ్లలో ఇప్పటికే బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేయగా.. రోడ్లకిరువైపులా ప్రమిదలు విక్రయిస్తున్నారు. వివిధ రకాల ప్రమిదలు విక్రయిస్తుండడంతో ప్రజలు కొనుగోలుకు ఆసక్తి కనబరుస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం


పద్మం ఆకారంలో దీపాలకుందులు


దీపం ప్రమిదలు




ప్రమిదలు కొంటున్న మహిళ


పంచముఖి ప్రమిద


రకరకాల దీపాల ప్రమిదలు